అధికారులు పనితీరు మార్చుకోవాలి

● రోడ్లు మరియు భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రద్యుమ్న

మంత్రాలయం రూరల్: రవాణా శాఖలో పురోగతి లేదని, అధికారులు పనితీరు మార్చుకోవాలని రోడ్లు మరియు భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న సూచించారు. గురువారం మంత్రాలయంలోని అబౌడీ హోటల్‌లో కర్నూల్, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు చెందిన ఆర్టీసీ, రవాణా, అర్‌అండ్‌బీ, జాతీయ రహదారి శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన జిల్లాల్లో ఆర్టీసీలో ఎక్కడైనా స్థల సమస్య ఉందా లేదా అని అడిగారు. ఆర్‌అండ్‌బీలో జరుగుతున్న రహదార్ల నిర్మాణ పనులు, వాటి పురోగతి, నూత న నివేదికలను గురించి చర్చించారు. జాతీయ రహదారులకు సంబంధించిన పలు అంశాలపై వివరా లను సేకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మంత్రాలయం-నాగులదిన్నె, ఎమ్మిగనూరు-కర్నూల్, సుంకేశ్వరి-కర్నూల్ రోడ్ల నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని, అంతే కాకుండా గుత్తి-ఆదోని జాతీయ రహదారికి సంబంధించిన భూముల బదలాయింపు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, నాలుగు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

పట్టణంలోని నాగులదిన్నె రహదారిలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఎమ్మిగనూరు వైపు జాతీయ రహదారి, పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ముందుగా పంచాయతీ కార్యాలయం వద్ద ఈఓ నాగరాజు ఆయనకు స్వాగతం పలికారు. రామచంద్రనగర్, రాఘవేంద్రపురం, నాగలదిన్నె రహదారికి ఇరువైపులా సీసీ రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య వినతి పత్రం అందజేయగా.. వెంటనే మంజూరు చేయాలని ఎస్‌ఈ నాగరాజును ఆదేశించారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు.

రహదారులను బాగు చేయండి

నియోజకవర్గంలో శిథిలావస్థకు చేరిన రహదారులను బాగు చేయాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి రోడ్లు మరియు భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్నను కోరారు. గురువారం మంత్రాలయంలోని అబౌడీ హోటల్‌లో ప్రద్యుమ్నను సన్మానించారు. నియోజకవర్గంలోని పెద్దతుంబళం-బసలదొడ్డి(7 కి.మీ), ఎమ్మిగనూరు-కోసిగి వయా మాలపల్లి(7 కి.మీ), కంబళదిన్నె-కల్లుకుంట(10 కి.మీ), కుప్పగల్-ఉరుకుంద(7.6 కి.మీ), కోసిగి- ఉరుకుంద(4 కి.మీ), మాధవరం-యం.తాండ(6 కి.మీ), కోసిగి-హాలీ వ్(8 కి.మీ), జాలవాడి-మంత్రాలయం వయా బూదూరు, సూగూరు మీదుగా(8 కి.మీ), కౌతాళం -అచ్చోలి(4 కి.మీ), కుప్పగల్-కౌతాళం(7 కి.మీ) వీటితో పాటు పలు చోట్ల కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టాలని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య నాయకులు జనార్దన్‌రెడ్డి ఉన్నారు.


ప్రద్యుమ్నకు వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

రాఘవుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మూల బృందావనం

మంత్రాలయం రూరల్ : రాఘవేంద్రస్వామికి గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీమఠం సందర్శనార్థం భక్తులు భారీగా తరలిరావడంతో క్షేత్ర పరిసరాలు కిటకిటలాడాయి. ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మఠం అధికారులు చర్యలు చేపట్టారు. పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మూలబృందావనానికి వేకువజామునుంచి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రహ్లాదరాయులు ఉత్సవమూర్తిని చెక్క, వెండి, బంగారు రథంపై ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.

క్లుప్తంగా

సీబీఎస్‌ఈ విధానంపై హెచ్‌ఎంలకు శిక్షణ


హెచ్‌ఎంలకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఈఓ సుకుమార్

ఆదోని అర్బన్ : సీబీఎస్‌ఈ విద్యా విధానంపై స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. రెండు రోజుల పాటు జరగనున్న సదస్సుకు డివిజన్‌లో సీబీఎస్‌ఈ విద్యా విధానానికి ఎంపికైన 30 పాఠశాలల హెచ్‌ఎంలు, ఒక సీనియర్ ఉపాధ్యాయుడు హాజరయ్యారు. మొత్తం 60 మందికి రిసోర్స్‌పర్సన్‌లు ఉమా, శ్రీనివాస్, వంశీమోహన్, శివభాస్కర్ శిక్షణ ఇచ్చారు. అంతకు ముందు డిప్యూటీ ఈఓ సుకుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్‌ను ఏర్పాటు చేస్తోందని, విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పోటీ పడేందుకు, జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించడానికి అవకాశం లభిస్తుందని చెప్పారు. కోర్సు డైరెక్టర్ ఎంఈఓ శివరాములు పాల్గొన్నారు.

ఖాదర్‌లింగస్వామికి ప్రత్యేక ఫాతెహాలు


ప్రత్యేక ఫాతెహాలు సమర్పిస్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రంలోనున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గురువారం భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. బుధవారం దర్గాలో గ్యార తారిఖ్ వేడుకలు జరగడంతో గురువారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. దీంతో దర్గా పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్ బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు.

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్

కోసిగి: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపీ యూటీఎఫ్) 2023 క్యాలెండర్, డైరీని ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఎంఈఓ లక్ష్మీనారాయణ గురువారం ప్రారంభించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు నాగన్న, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు భాస్కర్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్, లక్ష్మీకాంత్ రెడ్డి, కార్యదర్శులు రంగన్న, చిన్న ఈరన్న పాల్గొన్నారు.

మెస్ చార్జీలు పెంచాలి

కోసిగి: పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థిసంఘం తాలుకా అధ్యక్షుడు వీరేష్ కోరారు. గురువారం సాయంత్రం స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. వసతి గృహంలో వసతులు కల్పించాలన్నా సంఘం మండల ఉపాధ్యక్షుడు వీరేంద్ర, నాయకులు వీరేష్, రాము పాల్గొన్నారు.

రేపు ఉప్పరహాల్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కౌతాళం: మండలంలోని ఉప్పరహాల్ గ్రామంలో ఈనెల 7,9వ తేదీన ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు, స్థానిక సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

విద్యాభివృద్ధికి పాటుపడండి


డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కౌతాళం: ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి పాటుపడాలని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి సూచించారు. ఎస్టీయూ 2023 క్యాలెండర్, డైరీని గురువారం స్థానిక ఎంఆర్‌సీ భవనం వద్ద ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగరాజుతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ సీనియర్ నాయకుడు శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్ నరసింహులు, సోషల్ మీడియా కన్వీనర్ వీరచంద్రయాదవ్, ఆదోని, కౌతాళం నాయకులు రామకృష్ణ, తాయన్న, రాజేష్,, ఈశ్వర్, తిరుమలేష్, మహదేవప్ప, గోపాల్, సుంకన్న, రామాంజి, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

చేనేతలకు అండగా ప్రభుత్వం


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని అర్బన్ : చేనేతలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక గౌళీపేటలో వెలిసిన శ్రీ అంబాభవానీ ఆలయ ఆవరణలో ఆదోని స్వకులసాలి సమాజ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ముందుగా సంఘం సెక్రటరీ లక్ష్మణ్, మల్లికార్జున మాట్లాడుతూ జీవేశ్వర పాఠశాల ప్రహరీ, కల్యాణ మండపం ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. నాయకులు మహాదేవ్, కృష్ణ, శ్రీనివాసులు, విక్రమ్, నాగరాజ్, లక్ష్మి, గీత పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

● ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

పెద్దకడబూరు : అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటికి వెళ్లి పింఛన్లు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శ్రీవిద్య ఆధ్వర్యంలో కొత్తగా మంజూరైన పింఛన్లను గురువారం పంపిణీ చేశారు. ముందుగా అసంపూర్తిగా ఉన్న షాదీఖానా నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో గత నెల వరకు 6,556 మందికి పింఛన్లు ఇచ్చామని, కొత్తగా మరో 205 మందికి మంజూరయ్యాయని చెప్పారు. మాటకు కట్టుబడి రూ. 2,500 నుంచి రూ. 2750కి పింఛన్ మొత్తం పెంచామన్నారు. 20 ఏళ్లుగా మొండి గోడలకే పరిమితమైన షాదీఖానా నిర్మాణానికి ఎమ్మెల్యే నిధులలో రూ. 35లక్షలు మంజూరు చేశామని తెలిపారు. జాలవాడి గ్రామంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన శాంతమూర్తి కుటుంబ సభ్యులకు రూ.5లక్షల వైఎస్సార్ బీమా మెగా చెక్కును అందించారు. అనంతరం మండలానికి మనబడి నాడు – నేడు కింద రూ.1.53 కోట్లతో చేపట్టిన పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరి, వైస్ ఎంపీపీ పరమేష్‌గౌడ్, సర్పంచ్ రామాంజనేయులు, ఉప సర్పంచ్ విజయేంద్రరెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణప్ప, హెచ్‌ఎం రామమూర్తి, నాయకులు రవిచంద్రరెడ్డి, గజేంద్రరెడ్డి, గుడిసి శివన్న, శివారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కోర్టు తీర్పుపై హర్షం

ఆదోని అర్బన్ : ఏపీ దేవదాయ ధర్మదాయ శాఖ సలహాదారుగా జ్వాలాపురం శ్రీకాంత్‌ని హైకోర్టు ఇంతకుముందు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను తొలగిస్తూ నేడు తీర్పు ఇవ్వడంపై బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెల్లాల మధుసూదనశర్మ, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నఖాతే శ్యాంప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ దేవదాయ ధర్మదాయ శాఖ సలహాదారుగా శ్రీకాంత్‌ను నియమించిన వెంటనే కొందరు హైకోర్టును ఆశ్రయించారు. నాడు నియామకంపై స్టే విధించిన కోర్టు.. విచారణ జరపగా.. పిటిషనర్లు సరైన ఆధారాలు చూపలేకపోవడంతో కోర్టు స్టే తొలగించింది. తుది తీర్పు వచ్చే వరకు ఆయన పదవిలో కొనసాగవచ్చని కోర్టు స్పష్టం చేసిందన్నారు.


మాట్లాడుతున్న వెల్లాల మధుసూదనశర్మ

అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి

ఆదోని అర్బన్ /ఆదోని రూరల్ : జైన్ మతస్తుల పుణ్యక్షేత్రం ఝార్కండ్ రాష్ట్రంలోని 'సమ్మెత్ శిఖర్జీ' పర్వత శ్రేణుల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా అక్కడి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జైన్ మతస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుణ్యక్షేత్రం పరిధిలో మాంసం, మద్యం, జూదం, స్టార్ హోటళ్లు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.


సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు సమస్యను వివరిస్తున్న దృశ్యం

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఇందిరానగర్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి గురువారం భూమిపూజ చేశారు. కాలనీకి చేరుకున్న ఆయనకు స్థానికుల నుంచి ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో సీసీ రోడ్లు లేవని ప్రస్తావించడంతో రూ.20 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. త్వరలో 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా వస్తాయని, వాటితో డ్రెయినేజీలు పూర్తి చేస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు.

ఆసుపత్రుల సమస్యల పరిష్కారానికి కృషి


ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోని అర్బన్ : పట్టణంలోని రెండు ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలకొన్న సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం స్త్రీ, చిన్నపిల్లల ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పలు తీర్మానాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో నలుగురు మెడికల్ ఆఫీసర్‌లు అవసరముందని, ఇద్దరు హెడ్‌నర్సులు, స్టాఫ్‌నర్సుల పోస్టులు భర్తీ చేయాలని కోరారు. స్త్రీ, చిన్న పిల్లల ఆస్పత్రి సమీపంలో చికెన్ షాపులు ఎక్కువగా ఉన్నందున కాలువలు నిండిపోయి దుర్గంధం వస్తోందని చెప్పారు. ప్రసవానికి వచ్చిన వారికి, సహాయకులకు టాయిలెట్ సౌకర్యం లేదని, సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రోగుల సహాయకులు నిద్రించడానికి షెడ్ ఏర్పాటు చేయాలని, పాత పైపుల స్థానంలో కొత్త పైపులను ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సూపరింటెండెంట్ మాధవీలత, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఎంపీడీఓ గీతావాణి, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్, నాయకులు గోపాల్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

నేడు భవానీ రథోత్సవం


ముస్తాబైన రథం

కోసిగి: మండలంలోని ఆర్లబండ గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ అంబా భవాని రథోత్సవం శుక్రవారం జరుగనుంది. వేకువజామున ఆలయ పీఠాధిపతి మఠ్రిస్వాములు ఆధ్వర్యంలో అమ్మవారికి జలాభిషేకం, కుంకుమార్చన, వెండి కవచ అలంకరణ గావించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అమ్మవారి దర్శనార్థం తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి భక్తులు తరలి రానున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని సీఐ ఎరిసా వలి, ఎస్‌ఐ రాజారెడ్డి నిర్వాహకులకు సూచించారు.

వైఎస్సార్ బీమా సొమ్ము పంపిణీ

ఆదోని అర్బన్ : పట్టణంలో సహజంగా మరణించిన వారి కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం కింద రూ.లక్ష నగదును ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి గురువారం అందజేశారు. 18వ వార్డు బండిమెట్టలో వీరేంద్ర, ఫారుక్, లక్ష్మీనారాయణ సహజ మరణం పొందారు. దీంతో వారి భార్యలు శ్రీదేవి, హసీనా, బోయ శాంతికి స్థానిక కార్యాలయంలో రూ.లక్ష చొప్పున అందజేశారు.కౌన్సిలర్ చిన్నా, నాయకులు రామకృష్ణ, లతీఫ్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఆదోని రూరల్ : హానవాల్ గ్రామానికి చెందిన ఈశ్వరప్ప, మల్లికార్జున కర్ణాటక మద్యం తరలిస్తుండగా అరెస్ట్ చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ హరికృష్ణ తెలిపారు. గురువారం గ్రామ సమీపంలోని ఎల్లెల్సీ కాలువ వద్ద బైక్‌పై మద్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు సెబ్, డీటీఎఫ్ అధికారులు దాడులు నిర్వహించగా 288 కర్ణాటక మద్యం ప్యాకెట్లు లభించాయి. కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఎస్‌ఐలు శివప్రసాద్, స్వామినాథన్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో గ్రామాభివృద్ధి

కౌతాళం: గ్రామంలో నెలకొన్న సమస్యలను అందరి సహకారంతో పరిష్కారిస్తామని సర్పంచ్ గోవిందు, కార్యదర్శి యోగేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఏరిగేరిలో గ్రామసభను సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాజానగర్ తాగునీటి పథకం నుంచి గ్రామానికి నీరందించే పథకం పనులు 70శాతం పూర్తయ్యాయని త్వరలో మిగిలినవి పూర్తి చేస్తామని చెప్పారు. ఎంపీటీసీ అయ్యన్న, వైఎస్సార్‌సీపీ నాయకుడు నీలకంఠరెడ్డి పాల్గొన్నారు.

నాడు-నేడుతో పాఠశాలల్లో మార్పు

కౌతాళం: నాడు-నేడు కార్యక్రమంతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని బాపురం గ్రామ సర్పంచ్ శిల్పరెడ్డి, గ్రామ నాయకుడు గురునాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం జెడ్పీ పాఠశాలలో జరుగుతున్న ప్రహరీ నిర్మాణం, తాగునీరు, మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. పీఎంసీ చైర్మన్ రామలింగ, నాయకులు జైపాల్, అయ్యప్ప ఉన్నారు.

వాహనాల వేలం


బైక్‌లకు వేలం నిర్వహిస్తున్న సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్ రావు

కోసిగి: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు సెబ్ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయం ఆవరణలో 109 వాహనాలకు సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్ రావు, సీఐ సృజన్ బాబు ఆధ్వర్యంలో వేలం వేశారు. వారు మాట్లాడుతూ 2018 నుంచి అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాల వేలాలకు కొనుగోలుదారులు పోటాపోటీగా రూ.3వేలు డిపాజిట్‌లు కట్టి పాల్గొన్నారు. మొత్తం 109 వాహనాలకు గానూ 107 వాహనాలు వేలంలో పాటదారులు కైవసం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. వేలం ద్వారా 18 శాతం జీఎస్టీతో కలిపి రూ.13.72లక్షల ఆదాయం సమకూరిందని చెప్పారు. సెబ్ ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల వేళకు బస్సులు నడపాలి

ఆదోని అర్బన్ : మండలంలోని బల్లేకల్ గ్రామానికి పాఠశాలల వేళలకు అనుగుణంగా బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని డీఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా కన్వీనర్ ఉదయ్, నాయకులు వంశీ మాట్లాడుతూ సమయపాలన లేకుండా బస్సులు నడుపుతున్నారని, దీంతో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని పాఠశాలల సమయానికి అనుగుణంగా బస్సు నడపాలని కోరారు. కార్యక్రమంలో బల్లేకల్ విద్యార్థులు పాల్గొన్నారు.

స్థాయిని మరచి మాట్లాడొద్దు

ఆదోని అర్బన్: కౌన్సిలర్‌లుగా గెలవలేని మీరు.. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని విమర్శించే అర్హత టీడీపీ నాయకులకు లేదని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ నియాజ్‌అహ్మద్, యార్డు చైర్మన్ బాషా ధ్వజమెత్తారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఆదోని అభివృద్ధికి ఎమ్మెల్యే సాయి చేసిందేమి లేదనే వ్యాఖ్యలను వారు ఖండించారు. ఆదోనిని అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికే దక్కిందన్నారు.2014 – 2019 వరకు ఆదోని గ్రామీణం ఎందుకు అభివృద్ధి జరగలేదని ప్రశ్నించారు. మైనార్టీ, భీమిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, అమరావతినగర్ కాలనీలను అభివృద్ధి చేయడమే గాకుండా, 1090 ప్లాట్లు ఇచ్చి ఇల్లు కట్టించి ఇస్తుండటం అభివృద్ధి కాదా అని నిలదీశారు. అలాగే పత్తికొండ-ఎమ్మిగనూరు రోడ్డు వరకు బైపాస్, కల్లుబావి నుంచి సిరుగుప్ప క్రాస్ వరకు బైపాస్ రోడ్డు, మెడికల్ కళాశాల, మైనార్టీలకు ఐటీఐ కాలేజీ ఇలాంటి అభివృద్ధి పనులు కనిపించలేదా మండిపడ్డారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవా